సాక్షి
ఏలూరు
గురువారం । 7 । డిసెంబర్ । 2023



తమలపాకుల పూజ

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు.



రెండు పూటలా రుచికరం

శ్రీవారి క్షేత్రంలో రుచికరమైన అన్నప్రసాదాన్ని అందిస్తున్నట్లు ఆలయ చైర్మన్, ఈవో తెలిపారు. బుధవారం వారు వివరాలు వెల్లడించారు. 8లో ▸



ఆపద వేళ.. ఆపన్నహస్తంలా..

విపత్తు ఏదైనా సేవకు నిదర్శనంగా నిలుస్తున్నారు వలంటీర్లు. తుపాను వేళ హోరుగాలి, జోరువానలోనూ ప్రజలకు అండగా ఉంటూ నష్టనివారణకు తోడ్పడ్డారు. 8లో ▸

న్యూస్‌రీల్

సహాయక చర్యలపై సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి, జేసీ

ఏలూరు(మెట్రో): తుపాను ప్రభావంపై సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జేసీ బి.లావణ్యవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అధికారులంతా సాధారణ పరిస్థితులను తీసుకురావడంపై దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో డీఆర్వో యం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఎస్ఎస్‌కె ఖాజావలి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాజ్యాంగాన్ని లిఖించి ప్రజలకు ప్రజాస్వామ్య హక్కులను కల్పించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో పేద అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, పురోభివృద్ధికి సామాజిక సమతుల్యానికి బాటలు వేస్తూ ఆనాడు బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. ఆయన ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంబేడ్కర్ స్ఫూర్తితో సమాజంలో అసమానతలు తొలగించేలా విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 181.5 మి.మీ. వర్షపాతం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో గత 24 గంటల్లో 181.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జంగారెడ్డిగూడెం మండలంలో 301.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా ముదినేపల్లిలో తక్కువగా 92.2 మిమీ వర్షపాతం నమోదైంది. జీలుగుమిల్లి మండలంలో 285.0, కలిదిండి 164.8, కైకలూరు 164.4, పెదపాడు 114.4, ఏలూరు 122.6, కొయ్యలగూడెం 146.8, భీమడోలు 240.2, పెదవేగి 140.6, దెందులూరు 145.8, ఆగిరిపల్లి 150.0, ఉంగుటూరు 244.2, నూజివీడు 116.8, నిడమర్రు 217.4, జీలుగుమిల్లి 285.0, ముసునూరు 110.2, చాట్రాయి 140.2, లింగపాలెం 125.6, టి.నరసాపురం 240.2, కామవరపుకోట 250.8, బుట్టాయగూడెం 158.4, ద్వారకాతిరుమల 256.0, పోలవరం 197.0, చింతలపూడి 235.4, కుకునూరు 205.4, వేలేరుపాడు మండలంలో 218 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

9న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, బ్యాంకు లావాదేవీలు, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు, చిట్స్ అండ్ ఫైనాన్స్‌లలో ఈపీలు తదితర కేసులను రాజీ చేస్తారన్నారు.

సమ సమాజ స్థాపకుడు అంబేడ్కర్

తాడేపల్లిగూడెం అర్బన్: బీఆర్ అంబేడ్కర్ సమసమాజ స్థాపకుడిగా చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన అందిస్తున్నారన్నారని ఆయన చెప్పారు.

సహాయం.. ముమ్మరం

- ఏలూరు జిల్లాలో కొనసాగుతున్న తుపాను సహాయక చర్యలు
- ముందస్తు జాగ్రత్తలతో తప్పిన ముప్పు
- ఉపశమన చర్యల్లో అధికార యంత్రాంగం నిమగ్నం
- రైతులు, తుపాను బాధితులకు అండగా సహాయక చర్యలు
- నష్టం అంచనాల తయారీలో అధికారులు



కలిదిండి మండలంలో వర్షం నీరు బయటకు వెళ్లేలా తూడు తొలగిస్తున్న ఉపాధి కూలీలు



ఏలూరులో విద్యుత్ పునరుద్ధరణ పనులు

ఏలూరు(మెట్రో): మిచాంగ్ తుపాను జిల్లాలోని వరి, ఇతర వాణిజ్య పంటల రైతులకు భారీ నష్టం మిగిల్చింది. తుపాను విలయం నుంచి సాధారణ పరిస్థితులు నెలకొల్పే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టారు. పంట నష్టం నుంచి రైతులను గట్టెక్కించేందుకు చర్యలు చేపట్టారు. అధికార యంత్రాంగం తుపాను హెచ్చరికలు ప్రారంభమైనప్పటి నుంచి రైతులను అప్రమత్తం చేస్తూనే ధాన్యాన్ని తరలించే చర్యలు చేపట్టారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతంలో పొగాకు రైతులను, మెట్ట, డెల్టా ప్రాంతంలో వరి రైతులు నష్టపోయారు.

వరి, వాణిజ్య పంటలకు నష్టం

జిల్లా వ్యాప్తంగా 41,473 ఎకరాల్లో వరి పంటకు 650 ఎకరాల్లో మిరప, అరటి, బొప్పాయి, పామాయిల్, ఇతర కూరగాయల పంటలు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా రూపొందించారు. 4352 ఎకరాల్లో పొగాకు రైతులు నష్టపోయారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూనే ఉంది. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటూ కల్లాల్లో ఉన్న నీటిని తొలగిస్తూ, పూడుకుపోయిన డ్రెయిన్లలో పూడిక తీయిస్తున్నారు. 1300 ఎకరాలకు సంబంధించిన మురుగునీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకున్నారు. 80 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడగా, 79 గ్రామాల్లో విద్యుత్ పునరుద్దరణ పనులు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నానికే అన్ని గ్రామాల్లో విద్యుత్‌కు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటూ నష్టతీవ్రతను తగ్గించేందుకు కృషిచేస్తున్నారు. ఇంతవరకు ఆఫ్‌లైన్ విధానం ద్వారా 28,324 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి, వీలైనంత నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు జేసీ బి.లావణ్యవేణి నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూనే ఎప్పటికప్పుడు సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

ఉప్పొంగి ప్రవహిస్తున్న తమ్మిలేరు

తెలంగాణాలో కురుస్తున్న వర్షాలకు ఏలూరు జిల్లా మీదుగా ప్రవహిస్తున్న తమ్మిలేరు పొంగి ప్రవహిస్తోంది. మూడు చోట్ల గండ్లు పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా అధికారులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వలంటీర్లు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నారు. వలంటీర్లు అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ సమస్యలు పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించారు.

79 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో వివిధ గ్రామాల్లో ఏర్పడిన విద్యుత్ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించినట్లు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పీ.సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై విరిగిపడిన చెట్లను పొక్లెయిన్లతో తొలగించామని, ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ లైన్లను మరమ్మతులు చేశామని తెలిపారు.

రైతులకు అండగా ఉపాధి కూలీలు

ఏలూరు (టూటౌన్): వర్షాలకు పంట పొలాల్లో నీటిని మళ్లించే చర్యలను ఉపాధి హామీ కూలీ ద్వారా చేపట్టామని డ్వామా పీడీ ఎ.రాము తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభించిన ఈ పనులు జిల్లాలో ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. కలిదిండి మండలం సాన రుద్రవరంలో గుర్రపు డెక్కను తొలగించే పనులను ఎంపీపీ చందనపు ఉమామహేశ్వరరావుతో కలిసి డ్వామా పీడీ పర్యవేక్షించారు. గుర్రపు డెక్కను తొలగించడం ద్వారా 13 వందల ఎకరాల నుంచి మురుగునీరు బయటకు వెళ్తుందన్నారు. చింతలపూడి మండలం ప్రగడ వరంలో ఉన్న ధాన్యం బస్తాలను ఉపాధి హామీ కూలీల ద్వారా ట్రాక్టర్‌పై తరలించారు. లింగపాలెం మండలం గుడిచర్లలో ఉపాధి హామీ కూలీలు స్థానిక రైతులకు సహకరించారు.

వేగంగా నష్టనివారణ చర్యలు



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నష్టనివారణ చర్యలు చేపట్టాం. ఇప్పటికే ప్రాథమిక నివేదికలు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వానికి నివేదించిన అనంతరం నష్టపరిహారం సైతం రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లా అధికారులు తుపానును ఎదుర్కోవడంలో, ప్రజలకు కలిగిన ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించడంలో అత్యంత చొరవ చూపారు. ప్రస్తుతం ప్రజలకు ఏర్పడిన నష్టాలను అసౌకర్యాలను, ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా



పెదవేగి: కూచింపూడిలో ఇళ్లు కూలిన వారికి నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందిస్తున్న కొఠారు రామచంద్రరావు తదితరులు



దెందులూరు: పోతునూరు రైస్ మిల్లులో ధాన్యం కొనుగోళ్ల వివరాలను తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి



ముసునూరు : మండలంలోని వలసపల్లిలో మిర్చి పంటను ఒబ్బిడి చేయడంలో సహకరిస్తున్న ఉపాధి హామీ కూలీలు



భీమడోలు : బైపాస్ రోడ్డులో జేసీబీ సాయంతో ముంపు నీటిని తొలగింపునకు చర్యలు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

భీమడోలు: తుపాను ప్రభావంతో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు మండలంలో కోడూరుపాడు, ఎంఎం పురం గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలితో కలిసి పరిశీలించారు. అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రైతుల నుంచి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

ఏ ఒక్క రైతూ నష్టపోకుండా చూస్తాం

బుట్టాయగూడెం: తుపాను వల్ల పంటలు దెబ్బతిన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని తెల్లంవారిగూడెం సమీపంలో దెబ్బతిన్న పంటలను బాలరాజు బుధవారం పరిశీలించారు. కల్లాల్లో ధాన్యం ఉన్న రైతులు వాతావరణం అనుకూలించిన తర్వాత వారికి దగ్గరగా ఉన్న ప్రదేశాలకు తరలించుకోవాలని సూచించారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.

ప్రతి రైతుకు పరిహారం అందిస్తాం

పెదపాడు: తుపానుకు నష్టపోయిన రైతుకు అండగా ఉంటామని ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ స్పష్టం చేశారు. పెదపాడు మండలంలోని సత్యవోలు, సకలకొత్తపల్లి గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. తుపాను బారిన పడి నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు.

రైతుల్ని ఆదుకుంటాం

ముదినేపల్లి రూరల్: తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని చినపాలపర్రు, కోడూరు గ్రామాల్లో తుపాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరిచేలను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం పరిహారం అందిస్తుందని, అందరినీ ఆదుకుంటామని చెప్పారు.ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నష్టం అంచనాలు వెంటనే పంపాలి

ముసునూరు: పంట నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని వలసపల్లి, గుళ్ళపూడిల్లో ముంపునకు గురైన మిర్చి, పొగాకు, వరి, మొక్కజొన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. వలసపల్లిలో నీట మునిగిన మిర్చి, వరి పంట చేలను పరిశీలించారు. గుళ్ళపూడి శివారు గుడిపాడులో వరి పంటను పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, సమగ్ర సర్వేతో పంట నష్టం అంచనా వేసి, కలెక్టర్‌కు నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. నల్ల చెరువు, ధర్మ చెరువు కింద ముంపులో ఉన్న వరి పంట పొలాల్లో ప్రవహిస్తున్న నీటిని తక్షణమే బయటకు తరలించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనికోసం ఉపాధి హామీ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.



భీమడోలు: ఎంఎంపురంలో రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలిలు



ముదినేపల్లి రూరల్: చినపాలపర్రులో తడిచిన వరిపనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



ముసునూరు: గుళ్ళపూడిలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



బుట్టాయగూడెం: తెల్లవారిగూడెం సమీపంలో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



పెదపాడు: సత్యవోలులో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

మళ్లీ జగన్ ప్రభుత్వం ఖాయం

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

నూజివీడు: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం అన్నవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు పర్యటించానని, అన్ని ప్రాంతాల్లో కూడా జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఏర్పాటవుతున్న పరిశ్రమలు అన్నీ విజయవంతంగా సాగుతున్నాయన్నారు. ఇవన్నీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని విజయపథాన నడిపిస్తాయని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత 99 శాతం హామీలను అమలు చేసిన చరిత్ర రాష్ట్ర చరిత్రలో కేవలం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందన్నారు. రాష్ట్ర చరిత్రలో ముఖ్యమంత్రి జగన్ ముందు, జగన్ తరువాత అన్న రీతిలో అనేక మార్పులు తీసుకువస్తున్నారన్నారు. ఎంతో అభివృద్ధి జరుగుతుంటే ఒక వర్గం మీడియా కావాలని దుష్ప్రచారం చేస్తోందని కొమ్మినేని అన్నారు. వర్షం పడకపోతే రాష్ట్రమంతా కరువని రాశారని, ఇప్పుడు వర్షాలు కురిసే సరికి పంటలన్నీ దెబ్బతిని పోయాయని రాస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, జనసేన కాదని, ఈనాడు, ఆంధ్రజ్యోతి, మరికొన్ని టీవీ సంస్థలు ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్నాయన్నారు. తెలంగాణ ఎన్నికల ప్రభావం ఏపీపై ఉండదని కొమ్మినేని పేర్కొన్నారు. తెలంగాణలో టీడీపీని కాంగ్రెస్‌కు ఓటు వేయమని చంద్రబాబు పిలుపు నిచ్చినా హైదరాబాద్‌లో ఒక్క సీటు కూడా కాంగ్రెస్‌కు రాలేదన్నారు.

వర్జీనియాకు తీవ్ర నష్టం

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వర్జీనియా పొగాకు రైతు తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయాడు. జంగారెడ్డిగూడెం -1, 2 వేలం కేంద్రాలు, కొయ్యలగూడెం, గోపాలపురం , దేవరపల్లి వేలం కేంద్రాల పరిధిలో సుమారు 75 వేల ఎకరాల్లో రైతులు నాట్లు వేశారు. ఇటీవల నాట్లు పూర్తయ్యాయి. వేసిన నాట్లు ఎదుగుతున్న సమయంలో తుపాను రైతును దెబ్బతీసింది. జంగారెడ్డిగూడెం 1, 2 వేలం కేంద్రాల పరిధిలో సుమారు 20 శాతం వర్జీనియా పొలాలు ఇసుకమేటలు వేయడంతో తీవ్ర నష్టం సంభవించింది. గోపాలపురం, దేవరపల్లి, కొయ్యలగూడెం వేలం కేంద్రాల పరిధిలో కూడా కొంత మేర పొలాలు ఇసుక మేటలు వేశాయి. నాణ్యత కోల్పోయి పంట చేతికి రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క బ్యారన్‌కు ఐదెకరాలు వంతున వర్జీనియా వేయగా, ఇంత వరకు బ్యారన్ ఒక్కింటికి రూ. 3లక్షల వరకు పెట్టుబడులు పెట్టామని రైతులు చెబుతున్నారు.



వర్జీనియా పొగాకు తోట దెబ్బతిన్న దృశ్యం

రైతులకు అండగా నిలవాలి

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో): పంట పొలాల్లో నిలిచివున్న వర్షపునీటిని పూర్తిగా తొలగించడంపై దృష్టిపెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. బుధవారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అమలు చేయాల్సిన సహాయ పునరుద్ధరణ కార్యక్రమాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి రైతుకు అండగా నిలుస్తామన్న విషయాన్ని వారికి తెలియజెప్పి భరోసా కల్పించాలన్నారు. పంటల రక్షణ, పంటలకు పరిహారం అందించడం తడిసి ధాన్యాన్ని కొనుగోలు చేయడం దగ్గర నుంచి అన్ని రకాలుగా రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందనే విషయాన్ని చెప్పి ధైర్యం కల్పించాలన్నారు. రైతుల నుంచి ఆఫ్‌లైన్‌లో 28,324 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, రహదారుల పక్కన ఒబ్బిడిచేసిన ధాన్యాన్ని ఆరబెట్టి రైస్ మిల్లులకు పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కైకలూరు ప్రాంతంలో 11 డ్రయ్యర్ మిల్లులు ఉన్నాయని వాటి దగ్గరకు పంపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏలూరు డివిజన్ లో ఎక్కువ నష్టం జరిగినందున సంబంధిత ధాన్యం తరలింపులో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గినందున రెండు రోజుల్లో బృందాలు ఏర్పాటుచేసి పంటనష్టం అంచనా వేయాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టేందుకు 547 శానిటేషన్ బృందాలు, 1440 క్లాప్ మిత్రలు, 40 ట్రాక్టర్లు, 30 జేసీబీలు, 30 జనరేటర్లను వాడుతున్నామన్నారు. 78 వైద్య శిబిరాల ద్వారా 6,389 మందికి వైద్యం అందించామని చెప్పారు. ప్రాథమిక అంచనాల మేరకు జిల్లాలో 470 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదార్లు దెబ్బతిన్నాయన్నారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

క్లుప్తంగా

'చరిత్ర' షూటింగ్ ప్రారంభం



షూటింగ్‌కు క్లాప్ కొడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

నూజివీడు: నూతన తారాగణంతో, నూతన డైరెక్టర్, నిర్మాతలతో నిర్మిస్తున్న 'చరిత్ర' సినిమా షూటింగ్‌ను ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. మండలంలోని అన్నవరంలోని రామాంజనేయస్వామి ఆలయంలో బుధవారం చిత్ర యూనిట్‌తో కలిసి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ నిర్మాతగా మారిన కె.రామ్ రమేష్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నవికేత్, దియారాజ్ హీరోహీరోయిన్‌లుగా దర్శకుడు నందన్ కృష్ణన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు కొమ్మినేని శ్రీనివాసరావు క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ వర్ధమాన నటీనటులతో నూతన దర్శకుడు, నూతన నిర్మాతలు నిర్మిస్తున్న చరిత్ర సినిమా విడుదలైన తర్వాత ప్రజల ఆదరాభిమానాలతో చరిత్ర సృష్టించాలన్నారు.దర్శకుడు నందన్ కృష్ణన్, సహ నిర్మాత కె.వెంకటేశ్వరరావు, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

650 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం

ఏలూరు(మెట్రో): తుపాను దాటికి జిల్లాలో ప్రాథమిక అంచనా మేరకు సుమారు 650 ఎకరాల్లో ఉద్యాన పంటలు (మిరప, అరటి, బొప్పాయి, పామ్ ఆయిల్ మరియు కూరగాయలు) దెబ్బతిన్నాయని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

తాడువాయి క్షేత్రానికి వరద



క్షేత్రంలో పూజలు చేస్తున్న అర్చకుడు

జంగారెడ్డిగూడెం రూరల్: తాడువాయి వీరేశ్వరస్వామిక్షేత్రాన్ని వరద నీరు ముంచెత్తింది. ఎర్రకాలువ జలాశయం ఒడ్డున క్షేత్రం ఉండటంతో ఎగువ ప్రాంతం వచ్చిన వరద నీరు జలాశయంలోకి పోటెత్తడంతో శైవక్షేత్రంలోకి నీరు చేరింది. ఆలయ పరిసరాలతో పాటు, స్వామి వారి గర్భగుడిలో నీరు చేరి స్వామి, అమ్మవార్ల విగ్రహాలు సగానికి పైగా ముంపునకు గురయ్యాయి.

ఎర్రకాలువ ఉగ్రరూపం

ఎర్రకాలువ జలాశయం ఉగ్రరూపం దాల్చింది. ఇన్‌ఫ్లో 20 వేల క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుండగా డ్యాం నాలుగు గేట్లను ఎత్తి గంటకు 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు.

ఆపద వేళ.. ఆపన్నహస్తంలా..





ఆకివీడులో మూర్ఛరోగి రాజును సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న వలంటీర్, పెదమైనవానిలంకలో దివ్యాంగుడిని శిబిరానికి తీసుకువెళుతున్న దృశ్యం





వేములదీవిలో వృద్ధ దంపతులను పునరావాస కేంద్రానికి తీసుకువెళుతున్న వలంటీర్, మొగల్తూరు మండలం జీకే మెరకలో వంట చేస్తున్న దృశ్యం

తుపాను బాధితులకు వలంటీర్ల సేవలు

నరసాపురం రూరల్/ఆకివీడు/పాలకొల్లు అర్బన్: కరోనా.. వరదలు.. తుపాన్లు.. విపత్తు ఏదైనా సేవకు నిదర్శనంగా నిలుస్తున్నారు వలంటీర్లు. హోరుగాలి, జోరువానలోనూ ప్రజలకు అండగా ఉంటూ నష్టనివారణకు తోడ్పడుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాపై మిచాంగ్ తుపాను తీవ్ర ప్రభావం చుపగా నరసాపురం నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండల్లాలోని తీర ప్రాంతాల్లో బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడంతో వారి చూపిన చొరవతో ప్రాణనష్టం తప్పింది. అలాగే పూరిళ్లలో నివసిస్తున్న వారిని శిబిరాలకు తరలించిన అనంతరం బాధితుల ఇళ్లు నేలమట్టమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రజలంతా శభాష్ అంటున్నారు. అలాగే పునరావాస కేంద్రాల్లో వంటలు చేయడం వంటి సేవలను వలంటీర్లు అందిస్తున్నారు.

ముంపులో చిక్కుకున్న వారిని..

కుంభవృష్టితో లోతట్టు ప్రాంతంలో ముంపు నీటిలో చిక్కుకున్న ప్రజల్ని రక్షించడంలో వలంటీర్ సేవలు భళా అని పలువురు కొనియాడుతున్నారు. ఆకివీడులోని అమృతరావు కాలనీ ప్రాంతానికి చెందిన వలంటీర్ రేల రాజు శ్మశానవాటిక ప్రాంతంలో నివసిస్తున్న రోగులను, మూర్ఛరోగిని వారి ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చి రక్షించారు. రెండు అడుగులనీటిలో బాధితుల్ని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రంలోకి తరలించారు. అక్కడ వారికి భోజనం, వసతి సమకూర్చి అర్ధరాత్రి వరకు సేవలందించారు.

ఇంటింటికీ తిరిగి చెప్పాం



తుపాను ప్రభావం, దాని వలన కలిగే నష్టాలపై ఇంటింటికీ తిరిగి చెప్పాం. ముఖ్యంగా పాతబడిన పెంకుటిల్లు, పూరిపాకల్లో ఉన్నవారిని అప్రమత్తం చేశాం. వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లవద్దని ముందు జాగ్రత్తలు సూచించాం. అలాగే మూడు రోజులకు సరిపడా నీరు నిల్వ చేసుకోవాలని చెప్పాం. అనారోగ్య సమస్యలు ఉంటే చెబితే చర్యలు తీసుకుంటామన్నాం.

–ఎస్.నాగవేణి, వలంటీర్, సగంచెరువు, పాలకొల్లు మండలం

రెండు పూటలా రుచికరమైన అన్నప్రసాదం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో శ్రీవారి భక్తులకు రెండు పూటలా రుచికరమైన అన్నప్రసాదాన్ని అందిస్తున్నట్టు ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. స్వామివారి కొండపైన ద్వారకా అతిథి గృహంలో ఆలయ చైర్మన్ సుధాకరరావు అధ్యక్షతన బుధవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ప్రధాన ఆలయంతో పాటు, ఉప, దత్తత దేవాలయాలు, అనుబంధ సంస్థల ఆదాయ, వ్యయాలను ఆమోదించారు. క్షేత్రంలో సంగీత కళాశాల ఏర్పాటుకు ఆమోదముద్ర వేశారు. అనంతరం చైర్మన్ సుధాకరరావు, ఈఓ త్రినాథరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావుతో పాటు ట్రస్టు సభ్యులు మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, చిట్టూరి మణి, పాల వెంకటేశ్వరరావు, ఆచంట అనసూయ, గుర్రం సూర్యవతి, వాసా రామకృష్ణారావు వకుళమాత నిత్యాన్నదాన భవనాన్ని సందర్శించారు. అన్నప్రసాదాన్ని భక్తులతో కలిసి స్వీకరించారు. అనంతరం భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా చైర్మన్, ఈఓలు మాట్లాడుతూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో ఉదయం 10 గంటల నుంచి, సాధారణ రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాన్ని అందిస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో 7 గంటల నుంచి 10 గంటల వరకు ఈ వితరణ జరుగుతుందన్నారు. శనివారం రాత్రి అదనంగా అల్పాహారంగా ఉప్మాను అందిస్తున్నామన్నారు. రుచి, సుచి, నాణ్యతకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు.



భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న ఈఓ త్రినాథరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు

కొల్లేరు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి వినతి

కైకలూరు: కొల్లేరు గ్రామాలను కలుపుతూ సాగే రహదారుల నిర్మాణాలకు అటవీ శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆ శాఖ ఉన్నతాధికారులను కోరారు. గుంటూరులో ఆంధ్రప్రదేశ్ అరణ్యభవన్‌లో ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(పీసీసీఎఫ్) వై.మధుసూదనరెడ్డిని బుధవారం కలిసి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కైకలూరు మండలం సర్కార్ కాలువ వంతెన నుంచి కొల్లేటికోట దేవస్థానం మీదుగా పైడి చింతపాడు అదే విధంగా మండవల్లి మండలం పెద్ద ఎడ్లగాడి నుంచి పెనుమాకలంక మీదుగా ఇంగిలిపాకలంక, నందిగామ లంక రోడ్లుకు తక్షణం అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అలాగే కొల్లేరు ఆపరేషన్ సమయంలో కైకలూరు నియోజకవర్గం కైకలూరు, మండవల్లి మండలాల్లో అదనంగా ధ్వంసం చేసిన 7,500 ఎకరాలను పేదలకు పంపిణీ త్వరగా చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు ఉన్నారు.



పీసీసీఎఫ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

తమ్మిలేరు రహదారికి గండి

బలివే(ముసునూరు): ప్రసిద్ధ బలివే రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో కృష్ణా–పశ్చిమగోదావరి జిల్లాల మధ్య తమ్మిలేరుపై ఉన్న తాత్కాలిక వంతెన తుపాను ధాటికి బుధవారం తెగిపోయింది. గతంలో పడిన గండిని సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో పూడ్చి, సోమవారానికి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. అదేరోజు సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగుల్లో నీరు, పొలాల్లోని సర్దు వచ్చి, తమ్మిలేరులో కలవడంతో ప్రవాహ ఉధృతి పెరిగింది. దీంతో బుధవారం తమ్మిలేరుపై తాత్కాలిక రహదారికి గండిపడి బలివే–విజయరాయిల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. సర్పంచ్, కార్యదర్శి యోహాన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గండిని పరిశీలించి ప్రయాణికుల రాకపోకలు నిలిపివేసి గస్తీ ఏర్పాటు చేశారు.



బలివే వద్ద తెగిపోయిన రహదారికి గస్తీ కాస్తున్న దృశ్యం

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో బుధవారం శ్రీ భృగు, మరీచి, అత్రి, కాశ్యప శిష్య సహిత విఖనస మహాముని విగ్రహ, ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠలు వైభవంగా జరిగాయి. మహార్షుల ఉత్సవ మూర్తులకు, శిఖర కలశాలకు పూజాదికాలు నిర్వహించారు. ఆలయ జంట గోపురాలపై, నూతనంగా నిర్మించిన ఆలయంపై శిఖర కలశాలను, శ్రీ భృగు, మరీచి, అత్రి, కాశ్యప శిష్య సహిత విఖనస మహా ముని విగ్రహాలను ఏకకాలంలో ప్రతిష్ఠించారు. అగ్నిహోత్రం, మహాపూర్ణాహుతి వేడుకలను జరిపించారు. ఈ కార్యక్రమాలతో ప్రతిష్ఠా మహోత్సవాలు ముగిశాయి. శిఖరాలపై ప్రతిష్ఠించిన కలశాలను బహుకరించిన తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన దాత జంపన శ్రీరామ వెంకట నరసింహరాజు కుటుంబాన్ని ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా సత్కరించారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాథరావు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.



శిఖర కలశాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

లారీ డ్రైవర్‌కు జైలు

నూజివీడు: లారీని నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు 15 రోజుల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కుమ్మరి కుంట్లకు చెందిన గుగులోతు శ్రీను, అమల నూజివీడు మండలం లీలానగర్ అడ్డరోడ్డు సమీపంలోని కోళ్లఫారంలో కూలీలుగా పనిచేస్తున్నారు. 2020 ఆగస్టు 23న వీరిద్దరూ టీవీఎస్ మోపెడ్‌పై కోళ్లఫారానికి వెళుతుండగా లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అమల మృతిచెందింది. ఈ కేసులో తెలంగాణలోని కోదాడకు చెందిన లారీ డ్రైవర్ అన్వర్ హుస్సేన్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ కిషోర్‌బాబు వాదించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

బుట్టాయగూడెం: తుపాను కారణంగా మన్య ప్రాంతంలో కురిసిన వర్షాలకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో కొండవాగులు పొంగిపొర్లాయి. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం సమీపంలో కాల్వ వాగులో బర్రింకలపాడుకు చెందిన సిర్రి ముత్యాలరావు (23) అనే యువకుడు కొట్టుకుపోయాడు. ముత్యాలరావు, అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం వెళ్లి తిరిగి వస్తుండగా వరద ఉధృతంగా ప్రవహించడంతో ఊర చెరువులోకి దూసుకువెళ్లి గల్లంతైనట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడగా చెరువులో ద్విచక్ర వాహనం, అతడి మృతదేహం లభ్యమైంది. ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై వి.చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగులో రెడ్డిగణపవరానికి చెందిన ప్రతాపనేని నాగ దుర్గాగణేష్ (37) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతూ పడి గల్లంతయ్యాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ధర్మాజీగూడెంలో గోతిలో పడి..

లింగపాలెం: ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన తనగాల వెంకటేష్ (59) ప్రమాదవశాత్తు నీటి గోతిలో పడి మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి వెంకటేష్ నడుచుకుంటూ వెళ్లగా రోడ్డు పక్కనున్న గోతిలో పడి మృతిచెందాడు. కుటుంబసభ్యులు గాలిస్తుండగా బుధవారం ఉదయం గ్రామంలోని సొసైటీ సమీపంలో గోతిలో మృతదేహం కనిపించింది. గ్రామంలో ఇటీవల జియో టవర్ కోసం గొయ్యి తీసి పూడ్చకపోవడంతో ప్రమాదం జరిగినట్టు కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఎస్సై పి.చెన్నారావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొత్తూరి రమేష్, తహసీల్దార్ మురళీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.



జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో ముత్యాలరావు మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న దృశ్యం



నూజివీడు మండలం అన్నవరంలో డ్రెయినేజీలో వృద్ధుడు కృష్ణమూర్తి మృతదేహం

డ్రెయినేజీలో పడి వృద్ధుడు

నూజివీడు: మండలంలోని అన్నవరంలో వృద్ధుడు డ్రెయినేజీలో పడి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిల్లి కృష్ణమూర్తి (65) రాత్రి 10 గంటల సమయంలో వర్షంలో సైకిల్‌పై వెళుతూ ప్రధాన రహదారి పక్కనే ఉన్న డ్రెయినేజీలో పడిపోయాడు. బుధవారం ఉదయం స్థానికులు చూసి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై తలారి రామకృష్ణ మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.